683) గుండక్రియ

ప॥ ఘను డాతడా యితడు కలశాపురముకాడ। హనుమంతు డితడా అంజనాతనయుడు॥

చ॥ పెడచేత లోచేత నెరసి కొందరి గొట్టి। అదరి దానవుల హనుమంతుడు।
వెడిదంపుబెనుదోక బిరబిర దిప్పి మొత్తె। అడగ మాల్యవంతు హనుమంతుడు॥

చ॥ దాకాల మోకాల దాటించె గొందరి। ఆకాశవీధినుండి హనుమంతుడు।
పైకొని భుజముల బడదాకె గొందరి। ఆకడ జలధిలోను హనుమంతుడు॥

చ॥ అరుపుల నూరుపుల నందరి బారగ దోలె। ఔరా సంజీవికొండహనుమంతుడు।
మేరతో శ్రీవేంకటాద్రిమీదిదేవునిబంటు। ఆరితేరినబిరుదు హనుమంతుడు॥